క్లుప్తంగా

శభాష్ కిష్టాపూర్ ఓటర్లు

కొత్తగూడ: మండలంలోని మారుమూల గ్రామం కిష్టాపూర్ ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకుని శభాష్ అనిపించుకున్నారు. గ్రామంలో 196 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 10 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. మిగతా 186 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అధికారులు గ్రామస్తులను అభినందించారు. అందరు ఇదే మాదిరిగా తమ హక్కును వినియోగించుకుంటే నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని చర్చ జరుగుతుంది.

వామ్మో విమానం..



కొత్తగూడ: విమానం అంటే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇప్పటికి ఓ వింతే. శుక్రవారం మధ్యాహ్నం ఓ విమానం కొంత కింది నుంచి పోవడం దాని శబ్దానికి వ్యవసాయ పనుల్లో ఉన్న కూలీలు వామ్మో విమానం అంటూ ఒకింత భయానికి గురైనా ఆసక్తిగా తిలకించి తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుని ఆనందించారు.

'గార్ల'లో 81.64 శాతం పోలింగ్ నమోదు

గార్ల: మండలంలో గురువారం జరిగిన పోలింగ్‌లో 81.62 శాతం ఓట్లు పోలయ్యాయి. మండలంలో మొత్తం 29,745 ఓట్లు ఉండగా, వీటిలో 24,278 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా చిన్నబంజర పోల్ కాగా, గార్లలోని 186 పోలింగ్ బూత్‌లో అత్యల్పంగా ఓట్లు పోల్ అయ్యాయి. మండలం లోని గార్ల, మర్రిగూడెం, సీతంపేట, పుల్లూరు, మద్దివంచ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 7 గంటల వరకు క్యూలైన్లో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

గ్రామాల్లో పెరిగిన ఓటింగ్ శాతం

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీతో పాటు మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామాల్లో పోలింగ్ శాతం పెరిగింది. మండల పరిధిలో 31, మున్సిపాలిటీ పరిధిలోని 10 పోలింగ్ బూతుల్లో ఎన్నికలు జరగగా గ్రామాల పరిధిలోని 15 బూతులలో ఓటింగ్ శాతం 90కు పైగా నమోదైంది. అత్యధికంగా వెన్నారం పరిధిలోని 253వ బూత్‌లో 94.98 శాతం పోలింగ్ నమోదు కాగా రావిగూడెం పరిధి 246వ బూత్‌లో 94.89 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీ పరిధి లోని 10 పోలింగ్ బూతులకు సంబంధించి 160వ బూతులో అత్యధికంగా 86.77 శాతం పోలింగ్ నమోదు కాగా 164వ బూత్‌లో 58.43 శాతం అతితక్కువ శాతం పోలింగ్ నమోదైంది.

ఎన్నికల లెక్కల్లో నేతల బిజీ

కురవి: నియోజకవర్గంలోని కురవి, సీరోలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం పోలైన ఓట్లలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో తేల్చేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు లెక్కల్లో బిజీగా గడుపుతున్నారు. గ్రామాల వారీగా పోలైన ఓట్లలో తమకంటే తమ పార్టీకి ఎక్కువ ఓట్లు వచ్చాయంటూ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిలుచున్న అభ్యర్థి మన్ననలు పొందేందుకు పోటీలు పడుతున్నారు.

పరామర్శ

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖానాపురం సొసైటీ డైరెక్టర్ సునీతను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. సునీతను ఎమ్మెల్యే ఆస్పత్రిలో కలిసి ఆమె కుటుంబీకులతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, తుంగబంధం ఆర్‌బీఎస్ కన్వీనర్ వేజళ్ల కిషన్‌రావు, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ: మండలంలోని గొట్లకొండకు చెందిన మాలోతు స్వామి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి స్వామి చిన్ననాటి మిత్రులు శుక్రవారం రూ.50 వేల సాయం అందించారు. స్వామితోపాటు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2004–05 విద్యాసవత్సరంలో చదువుకున్న మిత్రులు తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం స్వామి భార్య పద్మకు రూ.50 వేలు అందజేశారు. అందజేసినవారిలో స్వామి మిత్రులు ప్రసాద్, రఘుమోహన్, శ్రీను, రమేశ్, రాజశేఖర్, రవి, రంజిత్, అశ్వార్, అశోక్ ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

తొర్రూరు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వనజ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డివిజన్ కేంద్రంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌పై అవగాహన ఉంటే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, రేణుకాదేవి, స్నేహలత, ప్రవళిక, పావని, సుమశ్రీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దాం

కురవి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ నివారణ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విరాజిత మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఇఓ గౌసొద్దీన్, బాలాజీ, పద్మబాయి, కుమారిదేవి, సునీత, ఎండీ నసీమా, కటాక్షి, ఉమాదేవి, శోభ పాల్గొన్నారు.

కేసముద్రం: ఎయిడ్స్ డే సందర్భంగా కేసముద్రం విలేజ్‌లోని వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని తెలిపారు.

చిన్నగూడూరు: ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో 'లెట్ కమ్యూనిటీస్ లీడ్' అనే థీమ్‌తో ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, ఎయిడ్స్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సమాజంలో స్వేచ్ఛగా జీవించే విధంగా మన వంతు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కేసముద్రంలో..



కురవి : ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రాములోరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- రెడ్యాలలో నేడు ద్వారతోరణ, ధ్వజస్తంభ ఆరాధన, పూర్ణాహుతి
- రేపు శ్రీసీతారాముల కల్యాణం



విశేష అలంకరణలో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామివారు

మహబూబాబాద్ రూరల్ : శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి మంగళాశాసనములతో శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు మండలంలోని రెడ్యాలలో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, విజయకాంత్‌రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో మొదటి రోజు సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోపణ పూజలు జరిపి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి యాగశాలలో ద్వారతోరణ, ధ్వజస్తంభ ఆరాధన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర యజ్ఞం, పూర్ణాహుతి, బలిహరణ పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని, సోమవారం ఉదయం యాగశాలలో మహా సుదర్శన యాగము, మహాపూర్ణాహుతి, నవకలశ స్నపనం, చక్రస్నానం, మహా కుంభప్రోక్షణ, ఋత్విక్ సన్మానము, ఆశీర్వచనము, ఉత్సవ సమాప్తి జరుగుతుందని తెలిపారు. రెడ్యాల గ్రామంలోని ప్రజలందరిని అనుగ్రహించడానికి శ్రీసీతారామచంద్రస్వామి వారు గ్రామంలోకి విచ్చేసి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ప్రతిష్ఠ రోజును పురస్కరించుకుని నాలుగు రోజులు ఉత్సవాలు జరపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

డోర్నకల్: మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్(ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నేహ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సిబ్బంది ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ రాధ, వీవోఏ అధ్యక్షురాలు వీరలక్ష్మి, కేంద్రం ఇన్‌చార్జ్ నల్లబెల్లి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది

ప్రజలు మార్పు కోరుకున్నారు



గూడూరు : మాట్లాడుతున్న కత్తి స్వామి



గార్ల : మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

గూడూరు : ఎన్నికల్లో మానుకోట, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, సీనియర్ నాయకుడు డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రానికి అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ పాలనకు ప్రజలు విసిగిపోయారనే విషయం జరిగిన ఎన్నికలో తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్ గెలుపునకు కృషి చేసిన మండల ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సూనావత్ రాధ, ఎండీ. యాకూపాష, వేం శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, యాకయ్య, సతీష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లందులో కాంగ్రెస్ గెలుపు ఖాయం

గార్ల: ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య 20 వేల మెజారిటీతో గెలవడం ఖాయమని కాంగ్రెస్ మండల నాయకుడు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జరిగిన ఎన్నికల్లో 60శాతానికి పైగా ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేసిన మండల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్.వెంకట్‌రెడ్డి, రాఫూజీ, పఠాన్ ఇమ్రాన్, వినోద, శ్రీనివాస్, జి.హరి, వెంకటేశ్వర్లు, సుమన్, రాములు పాల్గొన్నారు.

దారి మూసివేతపై అభ్యంతరం

డోర్నకల్ : రైల్వేయార్డు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పక్క నుంచి జయపురం, కిరీటూపురం, చర్చి ప్రహరీ వైపు వెళ్లే దారిని మూసేందుకు రైల్వే సిబ్బంది ప్రొక్లెయినర్‌తో గోతులు తీస్తుండగా శుక్రవారం స్థానికులు అడ్డుకున్నారు. గత పదేళ్లుగా రైల్వేస్టేషన్‌తో పాటు ట్రాక్‌కు ఇరువైపులా పట్టణంలోకి చర్చి కాంపౌండ్, కిరీటాపురం, జయపురం, బంకట్‌సింగ్‌తండా తదితర ప్రాంతాల ప్రజలు రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రసిద్ధి గాంచిన ఎఫ్‌పీసీ చర్చితో పాటు డీడీ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు ఈ మార్గాన్నే వినియోగిస్తున్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను వినతిపత్రం ద్వారా రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తాము రైల్వే అధికారులను కలిసి సమస్యను వివరిస్తామని, అప్పటి వరకు పనులు ఆపాలని స్థానికులు కోరారు.



దారి మూసివేతపై అభ్యంతరం తెలుపుతున్న కిరీటాపురం, జయపురం వాసులు

తొలగిన ప్రయాణికుల ఇబ్బందులు



బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించే రైలు ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి. రైల్వే స్టేషన్‌లోని 2, 3, 4వ ప్లాట్‌ఫారాలకు చేరుకునేందుకు ఉపయోగించే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి ప్లాట్‌ఫారం చివర నుంచి రైలు పట్టాలను దాటుతూ 2, 3, 4వ ప్లాట్‌ఫారాలు చేరేందుకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. స్టేషన్‌లో నూతన ఫుట్‌ఓవర్ ప్లాట్‌ఫారం నిర్మించి పాత ప్లాట్‌ఫారంను తొలగించడం, టికెట్ బుకింగ్ కార్యాలయం వైపు నుంచి ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నుంచి రెండో ప్లాట్‌ఫారంపై కొత్త ప్లాట్‌ఫారంను కలు పుతూ కనెక్టివిటీ వే నిర్మించడానికి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని మూయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనెక్టివిటీ వే నిర్మాణం పూర్తి చేసి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలను పునరుద్ధరించడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి.

వరిగడ్డిని కాల్చితే నష్టాలు



రైతులతో మాట్లాడుతున్న భాస్కర్‌రావు

రాయపర్తి: వరిగడ్డిని కాల్చితే నష్టాలు తప్పవని ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్ర శివారులోని పంట పొలాల్లోని వరిగడ్డిని కొందరు రైతులు కాల్చుతుండగా ఆయన అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వరిగడ్డిని నేల సంపదగా అభివర్ణించారు. గడ్డిని కాల్చితే భూమిలోని ఖనిజాలు, లవణాలు దెబ్బతిని భూసారం కోల్పోతుందని తెలిపారు. రెండు, మూడు పంటలు ఈశాక వరిగడ్డిని కాల్చితే పంటల దిగుబడి రాకుండా చవిటి నేలలుగా మారిపోతాయని చెప్పారు. లవణాల సాంద్రత పెరుగుతుందని, ఖనిజాలు లేని భూమిగా మారుతుందని అన్నారు. నేల, వాయు కాలుష్యం తోపాటు సదరు భూముల్లో భవిష్యత్తులో పంటలు పండవని తెలిపారు. గడ్డిని కాల్చడానికి ప్రత్యామ్నాయంగా పంట పొలాల్లోనే నీరుపెట్టి కుళ్లిపోయేలా చేయాలని, తదనంతరం సూపర్ ఫాస్ట్ చల్లితే గడ్డి త్వరగా కుళ్లిపోయి భూమికి జవనర్వాలు, సహజమైన ఎరువులు అందుతాయని చెప్పారు.

సమస్యల వలయం సరస్వతీ నిలయం

- సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు
- ముందుకురాని టెండర్ దారులు
- దసరా తర్వాత ప్రారంభం కాని హాస్టళ్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



ప్రారంభం కాని మోడల్ స్కూల్ హాస్టల్

మహబూబాబాద్ అర్బన్: పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన సరస్వతి నిలయం...సమస్యలమయంగా మారింది. వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. తాగటానికి మంచి నీరులేక, వ్యాధుల బారిన పడితే సమయానికి మందులు ఇచ్చే వారు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్న భోజన తయారీకి వంట కిరాణాసామాగ్రి అందడం లేదు. జిల్లాలో అన్ని మోడల్ స్కూల్ హాస్టళ్లో అన్నింటా సమస్యలు తాండవిస్తున్నాయి. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న దాదాపు 800 మంది విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పిస్తారు. చదువుకోవాల్సిన సమయంలో సమస్యలతో పోరాడాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దసరా తర్వాత ప్రారంభం కాని హాస్టళ్లు

పాఠశాల విద్యా సంవత్సరంలో హాస్టల్ స్కూల్స్ ప్రారంభానికి నెల రోజుల ముందే ప్రభుత్వం టెండర్ దారులను పిలిచి టెండర్ వేస్తుంది. ఆ ప్రకారం అటెండర్ దారుడు హాస్టల్‌కు కిరాణం వంట సామాగ్రి, చికెన్, మటన్, కోడిగుడ్లు తదితర సామాగ్రిని అందించే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. అలాంటిది మోడల్ స్కూల్ హాస్టల్స్ ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా మోడల్ స్కూల్ హాస్టల్ పై జిల్లా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం, హాస్టల్లో ఎలా సౌకర్యాలు ఉన్నాయి తెలుసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యంకు అద్దం పట్టినట్లు కనిపిస్తుంది. దసరా సెలవులకు ముందు కేజీబీవీ హాస్టల్లో ఉన్న టెండర్ దారులతో మోడల్ హాస్టల్లో కూరగాయలు, కిరాణా సామాగ్రి అందించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు అదే విధంగా మోడల్ స్కూల్ హాస్టల్ లో అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు టెండర్ దారులకు సమాచారం అందిస్తే గతంలోనే కేజీబీవీల హాస్టల్ లో పెండింగ్ బిల్లులు చాలా ఉన్నాయి. బిల్లులు అందంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, అందుకే ముందుకు రావడం లేదంటున్నారు. ఆఫీసర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా కేజీబీవీల్లో ఉన్నవారంతా తాత్కాలిక ఉద్యోగులేనని, జీతభత్యాలు కూడా చిన్నవేనని, ఏ చిన్న తప్పు జరిగినా వారిని ఉద్యోగాల నుంచి తొలగించే పరిస్థితి ఎదురవుతుందని ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మోడల్ స్కూల్ హాస్టల్ లో కిరాణా సామాగ్రి అందించే టెండర్‌దారులను పిలిపించి టెండర్ వేసి విద్యార్థులకు కిరాణా వంట సామాగ్రి అందించి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హాస్టల్ ప్రారంభించాలి



మోడల్ స్కూల్ హాస్టల్ ఉంటుందని నేను ఇందులో ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకున్నాను. ఫస్టియర్ హాస్టల్‌లో కొనసాగింది. సెకండియర్‌లో హాస్టల్ లో అన్ని సమస్యలు ఉండడంతో ఈ విద్యాసంవత్సరం హాస్టల్ ప్రారంభించలేదు. రోజు ఇంటికి సాయంత్రం వెళ్లాలంటే భయమేస్తుంది. వెంటనే హాస్టల్‌ను తిరిగి పునఃప్రారంభించాలి.

– బి. ఝాన్సీ, ఇంటర్ సెకండియర్

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

గార్ల: మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పిట్టల నాగేశ్వరరావు(61) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో గోపాలపురంలో మృతిచెందాడు. భౌతికకాయాన్ని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, సంఘం మేస్త్రీలు జడ శ్రీను, సావిటి వీరయ్య, తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం ప్రకటించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని చెర్లపాలెంకు చెందిన సముద్రాల మల్లయ్య పాడి గేదెను గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వాపోయాడు.

కిష్టయ్య ఆశయాలను కొనసాగించాలి



కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మదన్‌కుమార్

నర్సంపేట: తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ఆశయాలను కొనసాగించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండాల మదన్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పోలీస్ కిష్టయ్య 14వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మదన్‌కుమార్ మాట్లాడారు. రానున్న బహుజన రాజ్యంలో పోలీస్ కిష్టయ్య కుటుంబానికి తగిన గౌరవం కల్పిస్తామని, సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు బుర్ర సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసాని రమేశ్, మహిళా కన్వీనర్ గాదం స్వప్న యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో వార్షికోత్సవ పూజలు



ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

గూడూరు : స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి నేటికి 13 వసంతాలు నిండుకొని 14వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆశిష్‌పాండ్యే, సతీష్‌పాండ్యే ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. 6 గంటల నుంచి కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన భక్తులచే సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేయించి, అర్చన పూజలు చేశారు. అనంతరం గొల్లగూడెంకు చెందిన చీర భిక్షపతి దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చెన్నబోయిన ఉప్పలయ్య, యాదగిరి, బాబూరావు, సాయిలు, శ్రీనివాస్‌గుప్త ఏర్పాట్లు చేశారు.

అనసూర్య ఆశయ సాధనకు పోరాడాలి



సంతాప సభలో మాట్లాడుతున్న మండల వెంకన్న

కేసముద్రం : పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి బొమ్మనబోయిన అనసూర్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ధన్నసరిలో అనసూర్య సంతాప సభలో ఆయన మాట్లాడుతూ అనసూర్య ప్రజాసమస్యలు, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన నాయకురాలని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కళావతి లింగ్యా, జిల్లా కార్యదర్శి గొని ఐలయ్య, బండారి ఐలయ్య, మైన శ్రీనివాస్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు తిరుపతమ్మ, జానకి, లక్ష్మక్క పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో అనసూర్య సంతాప సభలో ఐఎఫ్‌టీయు రాష్ట్ర సహాయ కార్యదర్శి శివారపు శ్రీధర్ మాట్లాడుతూ ఆమె పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, వెంకన్న, బండి రాజు, మంజుల, విజయ, నీల, లాలు పాల్గొన్నారు.